క్లుప్తంగా

అలరించిన కవి సమ్మేళనం



కవి సమ్మేళనంలో పాల్గొన్న కవులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక జిల్లా కేంద్ర గ్రంథాలయంలో 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం శ్రీశ్రీ కళా వేదిక ప్రతినిధి శ్రీహరి కోటి ఆధ్వర్యంలో నిర్వహించిన కవి సమ్మేళనం ఆసక్తికరంగా సాగింది. పలువురు కవులు సామాజిక అంశాలను స్పృశిస్తూ చెప్పిన కవిత్వాలు అకట్టుకున్నాయి. శ్యామల కోటి, ఎంజే సుజయ కృష్ణ, పి.అనురాధ, పి.కార్తికేయ, ఎంవీఆర్ఎస్ శర్మ, ఎస్ కస్తూరీరావు, పీఎస్ఆర్ శ్రీనివాసరావు, నున్నా అంజూరావు, వి.సులోచన పాల్గొని కవి సమ్మేళనాన్ని రక్తి కట్టించారు. ఉదయం నగరానికి చెందిన రసన సాహితీ సాంస్కృతిక సంస్థ అధ్యక్షుడు ఈదుపల్లి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో కళాశాలల విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా మాజీ ఎమ్మెల్సీ రాము సూర్యారావు, జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఎం శేఖర్‌బాబు పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు తమ ఖాళీ సమయాన్ని వృథా కాకుండా గ్రంథాలయాలకు వచ్చి విజ్ఞానవంతులుగా మారాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో చలసాని సురేంద్ర, డిప్యూటీ లైబ్రేరియన్ ఎ.నారాయణరావు, బి.సత్యనారాయణ, అసిస్టెంట్ లైబ్రేరియన్ వీటీ సందీప్ కుమార్ కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

ఆప్కాస్ కార్మికులను పర్మినెంట్ చేయాలి

ఏలూరు (టూటౌన్) : మున్సిపల్ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులను (ఆప్కాస్) పర్మినెంట్ చేయాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సీఐటీయూ) జిల్లా గౌరవాధ్యక్షుడు బి.సోమయ్య కోరారు. కార్మికులను పర్మినెంట్ చేయాలని కోరుతూ ఈ నెల 20, 21 తేదీల్లో ఆందోళనలు చేపట్టనున్నట్టు తెలిపారు. ఈనెల 20న మున్సిపల్ ఆఫీసుల వద్ద నిరసన ప్రదర్శనలు, 21న జిల్లా కలెక్టరేట్ వద్ద వంటా వార్పు నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. 20న జిల్లాలోని ఏలూరు, జంగారెడ్డిగూడెం, చింతలపూడి, నూజివీడు మున్సిపాల్టీల వద్ద నిరసన ప్రదర్శనలు చేస్తామని వివరించారు.

లక్ష గోనె సంచులు సిద్ధం



మాట్లాడుతున్న వ్యవసాయాధికారి గద్దె రమేష్

దెందులూరు: మండలంలోని ఆర్బీకేల్లో లక్ష గోనె సంచులు సిద్ధంగా ఉన్నాయని వ్యవసాయశాఖాధికారి గద్దె రమేష్ అన్నారు. శుక్రవారం శ్రీరామవరం ఆర్బీకేలో సిబ్బందికి పలు సూచనలు చేశారు. రైతులు, సిబ్బంది, టెక్నికల్ అసిస్టెంట్లతో సమన్వయం చేసుకుని ధాన్యం కొనుగోలు పూర్తి చేయాలన్నారు.

పేదల చదువుకు అమ్మఒడి భరోసా

- 15 గ్రామాలు.. 4,241 మంది లబ్ధిదారులు
- నాలుగేళ్లలో రూ.19.14 కోట్ల జమ



ప్రభుత్వ పాఠశాలకు వెళుతున్న విద్యార్థినులు (ఫైల్)

ఏలూరు రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోన్న అమ్మఒడి పథకంలో గ్రామాల్లో పేదల చదువుకు అండగా మారింది. రెక్కాడితే గాని డొక్కాడని నిరుపేదలకు వరమైంది. ప్రైవేటు, ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థుల తల్లుల బ్యాంకు ఖాతాల్లో ప్రభుత్వం ఏటా రూ.15,000 వేలు జమచేస్తోంది. ఈ మొత్తంతో తల్లిదండ్రులు తమ బిడ్డల చదువు కోసం ఖర్చు చేస్తున్నారు. ఫలితంగా ఏ ఆటంకం లేకుండా పిల్లల చదువు కొనసాగడంతో పాటు పేద కుటుంబాలపై ఒత్తిడి తగ్గింది. అమ్మఒడి పథకం ఏలూరు రూరల్ మండల గ్రామాల్లో పేదలను విద్యావంతులను చేస్తోంది. 15 గ్రామాల్లో నాలుగేళ్లగా 4,241 మంది విద్యార్థుల తల్లుల బ్యాంకు ఖాతాల్లోకి ప్రభుత్వం రూ.19,14,86,931 అమ్మఒడి పథకం ద్వారా జమ చేసింది. పిల్లల చదువుకు అండగా నిలిచింది. ఐదేళ్ల క్రితం తన బిడ్డను చదివించాలంటే చాలా కష్టంగా ఉండేదని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏడాదికి ఇచ్చే రూ.15 వేలు ఇస్తుండడంతో స్కూల్ చదువుకు ఖర్చు చేస్తున్నానని గుడివాకలంక గ్రామానికి చెందిన జి శిరీష ఆనందం వ్యక్తం చేశారు.

నాలుగేళ్లలో చేకూరిన అమ్మఒడి లబ్ధి ఇలా..

గ్రామం	లబ్ధిదారులు	చేకూరిన లబ్ధి
చాటపర్రు	729	రూ.3,25,55,748
పైడిచింతపాడు	279	రూ.1,29,34,274
ప్రత్తికోళ్లలంక	412	రూ.1,80,93,96
కోటేశ్వరదుర్గాపురం	102	రూ.48,49,800
కోమటిలంక	127	రూ.54,12,133
శ్రీపర్రు	528	రూ.2,37,34,614
పెదయాగనమిల్లి	53	రూ.24,91,000
గుడివాకలంక	667	రూ.2,97,27,756
జాలిపూడి	501	రూ.2,27,93,823
మల్కాపురం	323	రూ.1,53,12,739
మాదేపల్లి	520	రూ.2,35,84,948

ఆదుకున్న అమ్మఒడి



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందించిన అమ్మఒడి పథకం నా కుటుంబానికి ఎంతో అండగా నిలిచింది. ఈ పథకం నేను ఎన్నటికీ మరిచిపోలేను. మా కుటుంబాన్ని ఆదుకుంది. ఏటా వస్తున్న రూ.15000తో నా బిడ్డ చదువు సాఫీగా సాగిపోతోంది. ఇదే క్రమంలో నా బిడ్డ ఉన్నత చదువు కొనసాగుతుందని ధైర్యం ఏర్పడింది.

– ఎస్ సజీధ, వెంకటాపురం

పేదలకు ఆదరణ



ముఖ్యమంత్రి ఏ పథకం పెట్టినా పేదలకు అండగా ఉంది. అమ్మఒడి ద్వారా నాలుగేళ్లలో నాలకు లబ్ధి చేకూరింది. ఆ డబ్బు వల్ల నా బిడ్డలు స్కూల్‌లో చదువుకుంటున్నారు. ఇలాంటి పథకాలు పేదలకు ఎంతో మేలు చేస్తాయి. అందుకే పేదలు అందరూ జగన్‌కి అండగా ఉంటున్నారు.

– కె.వెంకటలక్ష్మి, వైఎస్సార్ కాలనీ

భక్తిశ్రద్ధలతో నాగుల చవితి పూజలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నాగుల చవితి పూజలు శుక్రవారం ఏలూరు నగర ప్రజలు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కార్తీక శుద్ధ చవితి పర్వదినం సందర్భంగా ఏలూరు పోస్టల్ కాలనీ వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవస్థానం, పవర్‌పేట కాశీఅన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామి దేవస్థానాల్లో స్వామివార్లకు పత్యేక అభిషేకాలు నిర్వహించారు. శుక్రవారం తెల్లవారు జామున నాలుగు గంటల నుంచే ప్రజలు పలుప్రాంతాల్లోని పుట్టల వద్దకు చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఏలూరు కలెక్టర్ కార్యాలయం, జిల్లా పరిషత్ కార్యాలయం, అమీనాపేటలోని సుబ్రహ్మణ్యేశ్వరుని పుట్ట, కృష్ణా కాలువ గట్టు వెంబడి, పంపుల చెరువు గట్టు వెంబడి ఆయా ప్రాంతాల్లో ఉన్న పుట్టల వద్దకు భక్తులు అధిక సంఖ్యలో వెళ్లి పూజలు చేశారు. ఈ సందర్భంగా పుట్టల వద్ద వరి పిండితో ముగ్గులు వేసి పసుపు, కుంకాలతో అలంకరించి పుట్టలో ఆవుపాలు పోసి భక్తిశ్రద్ధలతో నమస్కరించారు. పుట్టలో పాలతో పాటు చిమ్మిలి, చలిమిడి, వడపప్పు, కోడిగుడ్లు, తేగల ముక్కలు, తాటిబుర్ర గుజ్జు తదితర పదార్థాలను వడ్డించి నాగులకు నైవేద్యంగా సమర్పించుకున్నారు. ఈ సందర్భంగా పిల్లలు, యువతీ, యువకులు పుట్టల వద్ద బాణసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. దీంతో పుట్టల వద్ద సందడి వాతావరణం ఏర్పడింది.

నవరత్నాలతో ప్రజల జీవన ప్రమాణాల పెంపు

ఎమ్మెల్యే ఆళ్ల నాని



పార్టీ జెండా ఎగురవేస్తున్న ఎమ్మెల్యే నాని



టూటౌన్‌లో మహిళలకు పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే నాని

ఏలూరు టౌన్ : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అమలు చేస్తోన్న నవరత్నాల పథకాలతో ప్రజల జీవన ప్రమాణాల్లో గణనీయమైన మార్పు వచ్చిందని ఏలూరు ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆళ్ల నాని అన్నారు. 123వ రోజు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం శుక్రవారం సాయంత్రం ఏలూరు టూటౌన్ పరిధిలోని 29వ డివిజన్‌లో ఆయన నిర్వహించారు. పాదయాత్రగా ఇంటింటికీ వెళ్లి ప్రజలకు అందుతోన్న సంక్షేమ పథకాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాని మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలనతో ప్రజల జీవన ప్రమాణాల్లో ఊహించని స్థాయిలో మార్పులు వచ్చాయన్నారు. పేద కుటుంబాలు సంతోషంగా జీవించేలా అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని చెప్పారు. మరోసారి వైఎస్ జగన్‌ని ముఖ్యమంత్రిని చేసుకునే బాధ్యత ప్రతి వ్యక్తిపైనా ఉందన్నారు. గతంలో చంద్రబాబు హామీలు ఇవ్వటం తప్ప వాటిని నెరవేర్చిన దాఖలాలు లేవని గుర్తుచేశారు. ఏదైనా సాంకేతిక లోపంతో పథకాలకు దూరమైతే వాటిని పరిష్కరించి అర్హులకు లబ్ధి చేకూరేలా చేయాలని అధికారులను ఆదేశించారు. తొలుత కార్పొరేటర్ ఉప్పుల సుజిత, పార్టీ నాయకులు ఉప్పుల సన్నీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే నానికి ప్రజలు, డివిజన్ నేతలు సాదర స్వాగతం పలికారు. డివిజన్‌లో పార్టీ జెండాను నాని ఆవిష్కరించారు. నాగులచవితిని పురస్కరించుకుని స్థానిక సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో స్వామివారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్ఎంఆర్ పెదబాబు, జిల్లా కోశాధికారి మంచెం మైబాబు, డిప్యూటీ మేయర్లు గుడిదేశి శ్రీనివాసరావు, ఎన్.సుధీర్‌బాబు, ఏఎంసీ చైర్మన్ నెరుసు చిరంజీవులు, నగర అధ్యక్షుడు బొద్దాని శ్రీనివాస్, కోఆప్షన్ సభ్యులు మున్నుల జాన్‌గురునాథ్, నగర కమిషనర్ సంక్రాంతి వెంకటకృష్ణ, తహసీల్దార్ సోమశేఖర్, కార్పొరేటర్లు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు ఉన్నారు.

సీఎం జగన్‌ను కలిసిన ప్రజాప్రతినిధులు






సీఎం జగన్ వద్దకు అథ్లెట్ సాహిల్‌ను తీసుకెళ్లిన ఎమ్మెల్యే నాని, పుష్పగుచ్ఛం అందిస్తున్న మేయర్ నూర్జహాన్, పెదబాబు, పిల్లంగోళ్ల శ్రీలక్ష్మి, రాఖీ కడుతున్న శ్రీదేవి

ఏలూరు టౌన్: ఏలూరు జిల్లా నూజివీడులో అసైన్డ్ భూ పట్టాల పంపిణీ కార్యక్రమానికి హాజరైన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని హెలీప్యాడ్ వద్ద ఏలూరు ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆళ్ల నాని మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేశారు. జిల్లాలో పరిస్థితులపై ఆయనకు వివరించారు. హన్మకొండలో జరిగిన 34వ జాతీయస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో అండర్-16 పురుషుల 100 మీటర్ల పరుగు పోటీలో బంగారు పతకం సాధించిన ఏలూరు వంగాయగూడెంకు చెందిన అథ్లెటిక్ క్రీడాకారుడు కేఎస్ఎస్ సాహిల్‌బాబును ఎమ్మెల్యే నాని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వద్దకు తీసుకెళ్లారు. సాహిల్‌బాబుకు ప్రభుత్వం అన్ని విధాల అండగా ఉంటుందని సీఎం భరోసా ఇచ్చారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని రాష్ట్ర సాహిత్య అకాడమీ చైర్‌పర్సన్ పిల్లంగోళ్ల శ్రీలక్ష్మి, ఏలూరు నగర మేయర్ షేక్ నూర్జహాన్, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి, కోఆప్షన్ సభ్యుడు ఎస్ఎంఆర్ పెదబాబు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు. ఏలూరు 7వ డివిజన్ కార్పొరేటర్ పిల్లంగోళ్ల శ్రీదేవి సీఎం జగన్ చేతికి రక్షాబంధన్‌ను కట్టారు.

రైతాంగ, కార్మిక వ్యతిరేక విధానాలను ప్రతిఘటించాలి



మహాధర్నా కరపత్రం విడుదల చేసిన నాయకులు

ఏలూరు (టూటౌన్): కేంద్రంలోని మోదీ ప్రభుత్వం అనుసరిస్తోన్న రైతాంగ, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను ప్రతిఘటించాలని రైతు సంఘాలు, కార్మిక సంఘాలు పిలుపునిచ్చాయి. ఈ నెల 27, 28 తేదీల్లో విజయవాడలో నిర్వహించే మహాధర్నాను విజయవంతం చేయాలని కోరాయి. ఈ మేరకు స్థానిక ఆర్ఆర్‌పేటలోని స్ఫూర్తిభవన్‌లో ఏపీ రైతు సంఘాల జిల్లా సమన్వయ కమిటీ, కేంద్ర కార్మిక సంఘాల జిల్లా సమన్వయ కమిటీ సంయుక్త సమావేశం శుక్రవారం ఏర్పాటుచేశారు. మహాధర్నా కరపత్రం విడుదల చేశారు. ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి డీఎన్‌వీడీ ప్రసాద్, బీకేఎంయూ జిల్లా అధ్యక్షుడు బండి వెంకటేశ్వరరావు, ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి బద్దా వెంకట్రావు, ఏఐటీయూసీ జిల్లా నాయకులు కె.కృష్ణమాచార్యులు మాట్లాడారు. ఢిల్లీ రైతాంగ ఉద్యమం సందర్భంగా మోదీ ప్రభుత్వం లిఖిత పూర్వకంగా ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మోసం చేసిందని విమర్శించారు. దేశ సంపదను, ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ కంపెనీలకు కట్టబెడుతూ రైతాంగ, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. పంటలకు మద్దతు ధర గ్యారెంటీ చట్టం, రైతు రక్షణ విమోచన చట్టం తక్షణం తేవాలని, నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, విశాఖ ఉక్కు ప్రభుత్వ రంగ పరిశ్రమల ప్రైవేటీకరణ ఆపాలని, అసంఘటిత రంగ కార్మికులకు సమగ్ర చట్టం తేవాలని కోరారు. పెట్రోలు, డీజిల్, గ్యాస్, నిత్యావసర సరుకుల ధరలు తగ్గించాలన్నారు. ఆయా సంఘాల నాయకులు కొర్రి విజయలక్ష్మి, కాకి నాని, ఎ.అప్పలరాజు, వి.సాయిబాబు, బి.జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	30	అరటి కాయ (1)	07-10
వంకాయలు (గులాబీ)	24	చిక్కుడు కాయలు	48
వంకాయలు (కాంతులు)	28	చామదుంపలు	40
వంకాయలు (తెలుపు)	--	ములక్కాడలు	07-10
బెండకాయలు	36	కంద	60
పచ్చిమిర్చి	28	బీట్‌రూట్	40
కాకర కాయలు	28-32	కీరా దోస	44
బీరకాయలు	24	ఫ్రెంచ్‌బీన్స్	90
బీరకాయలు (పందిరి)	40	అల్లం	120
క్యాబేజీ	22	కొత్తిమీర (కట్ట)	23
క్యారెట్	44-48	పాలకూర	10
దొండకాయలు	22	చుక్కకూర	10
బంగాళదుంపలు	26	తోటకూర	10
ఉల్లిపాయలు	45-55	గోంగూర	06
గోరుచిక్కుడు	44	పుదీనా	05
దోసకాయలు	16	బఠాణీ	--
అనటికాయ (1)	15-20	క్యాప్సికమ్	70
పొట్లకాయ(1)	15-20	చిలకడదుంప	28

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	31
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం (ఇంద్ర)	21.00	32
ఏలూరు - బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	32
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	31

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్	21.45	4820	12
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	16
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	13
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	17
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	18
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	13
ఏలూరు - విశాఖపట్నం	12.00	4840	28
ఏలూరు -తిరుపతి	16.00	4830	28

రబీలో ఆరుతడి పంటలు వేయాలి



రైతులకు అవగాహన కల్పిస్తున్న మండల వ్యవసాయ అధికారి ప్రదీప్‌కుమార్

పెదపాడు: బోరు వెల్ ఆధారిత రైతులు వరికి బదులుగా ప్రత్యామ్నాయ పంటలు వేసుకోవాలని పెదపాడు మండల వ్యవసాయ అధికారి వీ ప్రదీప్ కుమార్ సూచించారు. పెదపాడు మండలంలోని వట్లూరు రైతు భరోసా కేంద్రంలో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రదీప్‌కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం సూచనల మేరకు బోరు వెల్ సదుపాయం ఉన్నప్పటికీ రబీ సీజన్‌లో వరికి బదులు ప్రత్యామ్నాయ పంటలు వేయడం మంచిదన్నారు. ఆ దిశగా ముందుకు సాగాలని సూచించారు. భూమి స్థితిగతులు నీరు కరెంటు లభ్యతను దృష్టిలో ఉంచుకుని పంట మార్పిడికి అవకాశం ఉన్న రైతులు తప్పనిసరిగా వరికి బదులు ఇతర పంటలు వేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వట్లూరు గ్రామ రైతులు వ్యవసాయ సలహా మండలి సభ్యులు కే నాగవెంకట శ్రీనివాసరావు, ఉపసర్పంచ్ చింతా మధుసూధనరావు, రైతుభరోసా కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా పడి పూజ

దెందులూరు: గాలాయగూడెం అచ్చమ్మపేరంటాలమ్మ తల్లి ఆలయంలో గురుస్వామి పెద్దిశెట్టి నాని అయ్యప్పస్వాముల ఆధ్వర్యంలో అయ్యప్ప పడిపూజ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. కేరళకు చెందిన బ్రహ్మశ్రీ మురళీధరన్ నంబూద్రి ముఖ్య అతిథిగా విచ్చేసి తడికమళ్ళ ప్రసాద్, రాజేష్ గురుస్వామి ఆధ్వర్యంలో భజన, పడిపూజ నిర్వహించారు. 18 మెట్లతో కూడిన వేదిక పడిపూజలో ప్రత్యేకాలంకరణగా నిలిచింది. భవానీలు, శివస్వాములు, సాయి స్వాములు, గోవిందస్వాములు, అయ్యప్పస్వాములు పడిపూజలో పాల్గొన్నారు.


మూర్ఛ వ్యాధిపై అవగాహన పెంపొందించుకోవాలి



గోపన్నపాలెంలో మూర్ఛపై అవగాహన సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ రాజశేఖర్

దెందులూరు : ప్రతి ఒక్కరూ మూర్ఛ వ్యాధిపై అవగాహన పెంపొందించుకుని ఆహార నియమాలను పాటించాలని గోపన్నపాలెం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రాజశేఖర్ అన్నారు. శుక్రవారం గోపన్నపాలెం పీహెచ్‌సీలో ఉమా ఎడ్యుకేషనల్ టెక్నికల్ సొసైటీ ఆధ్వర్యంలో జిల్లా దివ్యాంగుల పునరావాస కేంద్రంలో జాతీయ మూర్ఛ దినోత్సవం (ఎపిలెప్సీ డే)పై అవగాహన సదస్సు నిర్వహించా రు. మూర్ఛ వ్యాధి బారినపడిన వ్యక్తులు, కుటుంబాలు సమాజాలపై దాని ప్రభావంపై అవగాహన పెంపొందించేందుకు జాతీయ ఆరోగ్య సంరక్షణ కార్యక్రమంలో భాగంగా ఏటా నవంబర్ 17న దేశంలో జాతీయ మూర్ఛ దినోత్సవం నిర్వహిస్తా రని తెలిపారు. నాడీ సంబంధిత రుగ్మత మూర్ఛతో ప్రపంచ వ్యాప్తంగా 7 కోట్ల మంది, దేశంలో 1.2 కోట్ల మంది ఉన్నారన్నారు. ఆల్కహాల్ అలవాటు, ఒత్తిడి ఉండకూడదని తలకు గాయాలు తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, త్వరగా నిద్రపోవాలని దివ్యాంగుల పునరావాస కేంద్ర కోఆర్డినేటర్ శ్రీనివాసరెడ్డి అన్నారు. కృత్రిమ అవయవాలు, ఫిజియోథెరపీ, ఆడియోలాజీ, స్పీచ్ థెరపీ, యూడీఐడీ సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

దాతల సాయంతో పాఠశాలలో అభివృద్ధి పనులు



దాతల సాయంతో నిర్మించిన భోజన శాల, సైకిల్ షెడ్డును ప్రారంభించిన సర్పంచ్ సుధీష్ణ

ఉంగుటూరు: దాతలు సాయంతోనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని కాగుపాడు సర్పంచ్ కడియాల సుధీష్ణ అన్నారు. కాగుపాడులో రూ.7 లక్షలతో నిర్మించిన సైకిల్ షెడ్డును, భోజనశాలను శుక్రవారం సర్పంచ్ సుధీష్ణ ప్రారంభించి మాట్లాడుతూ కాగుపాడు అభివృద్ధికి దాతలు సహకరిస్తున్నారన్నారు. దాతలను అభినందించారు. ఎన్ఆర్ఐలు సుంకవల్లి కృష్ణారావు, సూర్యలక్ష్మి వారి కుమారులు వేణుగోపాల్, అనుపమ, క్రాంతికిరణ్, పల్లవి, కుమార్తె పద్మజ, సత్యనారాయణ వారి తల్లిదండ్రుల పేరున సుంకవల్లి రాజగోపాలరావు, గోపెమ్మల జ్ఞాపకార్థం పెద్ద నిర్మించారని తెలిపారు. దాతలు ఏటా మెరిట్ విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందజేస్తున్నారని చెప్పారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో సుంకవల్లి కుమారి, వంకిన నారాయణరావు, కడియాల జానకి రామ్, కడియాల రంగారావు, కడియాల రవిశంకర్, వంకిన ప్రతాప్, కడియాల వెంకటేశ్వరరావు, కడియాల ప్రేమ సాయి, కృష్ణయ్య, ప్రధానోపాధ్యాయులు ఉమాదేవి, యోగానందం, బ్రహ్మానందం పాల్గొన్నారు.